క్లుప్తంగా

ప్రజాభిప్రాయ సేకరణకు నేడు ఆర్టీసీ అధికారుల సమావేశం

మణికొండ: ప్రజల వద్దకే ఆర్టీసీ అనే నినాదంతో పలు కొత్త రూట్లలో బస్‌లు నడుతున్న అధికారులు ఆయా సర్వీసులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా మంచిరేవుల నుంచి నార్సింగి, మణికొండ, బంజారాహిల్స్, సికింద్రాబాద్ వరకు ఇటీవల 47వై ఏర్పాటు చేశారు. ఆ సర్వీసుపై ప్రయాణికుల అభిప్రాయాలతో మార్పులు, చేర్పులు చేసే నిమిత్తం శుక్రవారం ఉదయం 9గంటలకు సమావేశం ఏర్పాటు చేశారని వీఆర్ 4 యు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశానికి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న, డివిజనల్ మేనేజర్ అపర్ణ కల్యాణి, మేనేజర్ లక్ష్మీధర్మ, సీఆర్‌సీ ధర్మేంద్ర, సేఫ్టీ వార్డెన్ లక్ష్మణ్‌లు పాల్గొంటున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

ధర్మగిరి క్షేత్రంలో అన్నదానం



శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో బాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి, పల్లకి సేవ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సుమారు రెండు వేల మంది భక్తులు బాబాను దర్శించుకున్నట్లు ఆలయ ట్రస్టీ శివదత్తసాయి తెలిపారు.

స్కూల్ టాపర్స్‌కు అభినందనలు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: అత్తాపూర్ రవీంద్రభారతి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ టాపర్స్‌ను పాఠశాలలో డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపల్ సుధలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో ప్రతి సంవత్సరం తమ విద్యార్థులు 10 జీపీఏతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు.

ఏజీవర్సిటీ కంట్రోలర్‌గా శివాజీ



నూతన కంట్రోలర్‌కు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

ఏజీవర్సిటీ: ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంట్రోలర్‌గా డి శివాజీ నియమితులయ్యారు. ఆ పదవిలో ఉన్న రమేష్‌కుమార్‌ను వేరే శాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు శివాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయం ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. రమేష్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

'సీఎం కప్'కు దరఖాస్తులు అందజేత



మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తులు ఇస్తున్న క్రీడాకారులు

మణికొండ: ఈనెలలో మండల స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలకు నార్సింగిలో గురువారం క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారు. కబడ్డీకి రెండు టీములు, వాలీబాల్‌కు 3 టీములు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడలతో మంచి గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న హనుమాన్ జయంతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఈనెల 14వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి గురువారం తెలిపారు. ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి అభిషేకం, అలంకారం తదితర పూజలను నిర్వహిస్తామన్నారు. 8.30 గంటల నుంచి శివాలయ మండపంలో 108 సార్లు 'హనుమాన్ చాలీసా పారాయణ' కార్యక్రమాన్ని భజన బృందంతో నిర్వహిస్తామన్నారు.

సమ్మర్ క్యాంపు

- శిల్పారామంలో ఈ నెల 19వ తేదీ వరకు..
- ఉదయం 10గంటల నుండి 1 గంట వరకు తరగతులు
- శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు
- రిజిస్ట్రేషన్ కొరకు 8886652030, 8886652004



పెయింటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

మాదాపూర్: వేసవి సెలవుల సందర్భంగా మాదాపూర్ శిల్పారామంలో సమ్మర్ క్యాంపును ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. 6 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వారు వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేయనున్నారు. మట్టి కుండల తయారీ, మధుబని పెయింటింగ్, చెరియాల్, నిర్మల్, ట్రైబల్, అక్రిలిక్ పెయింటింగ్, క్లే టాయిస్, పెన్సిల్ స్కెచ్, సంస్కృతం మాట్లాడడం, భగవద్గీత శ్లోకాలు సమ్మర్ క్యాంపులో నేర్పించనున్నట్టు తెలిపారు కాగా.చిన్నారులు సరదాగా గడుపుతూ అందమైన చిత్రాలను వేస్తున్నారు.



మట్టిపాత్రల తయారీ

శిక్షణ తరగతులకు హాజరైన వారికి మట్టి పాత్రల ప్రాముఖ్యతను తెలుపుతూ, వివిధ ఆకృతులలో తయారు చేయడంలో శిక్షణ ఇస్తాము. చిన్నచిన్న మట్టి కుండలు, గ్లాసలు, మగ్‌లు ప్లేట్‌లు తయారు చేసిన అనంతరం వారికే ఇస్తాము. ఇలాంటి కళలను చిన్నారులు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని శిక్షకుడు సుధాకర్ తెలిపారు.

సంస్కృతం..భగవద్గీత శ్లోకాల్లో ..

సంస్కృతం నేర్చుకోవడం వల్ల దేవభాష తెలుస్తుంది.అలాగే భగవద్గీత గొప్పతనాన్ని వివరిస్తూ గీత శ్లోకాలను ఏవిధంగా ఉచ్ఛరించాలో నేర్పిస్తున్నారు. శ్లోకాలు చెప్పిన అనంతరం వాటి భావంతో పాటు ఉదాహరణలను తెలుపుతున్నారు. గీత చదవడం వల్ల సరైన మార్గంలో పయనిస్తారని తెలిపారు.

పెయింటింగ్స్‌లో..

పెయింటింగ్స్‌తో వికాసం కలుగుతుంది. గృహిణులు వివిధ రకాల చీరలపై, వివాహాది శుభకార్యాలకు ప్రత్యేకంగా పెయింటింగ్‌లు వేస్తుంటారు. వారికి ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది. ఐతే పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వీటిని కేవలం సమ్మర్ క్యాంపుకే పరిమితం కాకుండా సంవత్సరం పొడవు ప్రాక్టీస్ చేస్తే నైపుణ్యం వస్తుందని, మధుబని పెయింటింగ్ శిక్షణ రాజేశ్‌జా, చెరియాల్ పెయింటింగ్‌లో రాకేశ్, ట్రైబల్ పెయింటింగ్‌లో గణేశ్‌లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెయింటింగ్ చాలా ఇష్టం



నాకు పెయింటింగ్ అంటే చాలా ఇష్టం. కానీ నేర్చుకోవాలంటే సమయం లేక ఇబ్బంది. శిల్పారామంలో సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేయడం వల్ల పెయింటింగ్ నేర్చుకుంటున్నాను. మాస్టర్ చాలా సులభంగా నేర్పుతున్నారు.

–శ్రేష్ఠ, 7వ తరగతి విద్యార్థిని

చిన్నప్పటి నుంచే ప్రోత్సహించాలి



చిన్నప్పటి నుంచే చిన్నారులను వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అందుకుంటారు. పెయింటింగ్ రంగంలో ఎంతోమంది రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివిధ రంగాలలో ప్రోత్సహించినప్పుడే కొత్తకొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారు.

–రాకేశ్, పెయింటింగ్ ఆర్టిస్ట్

20 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



మంచిరేవుల వేణుగోపాలస్వామి ఆలయం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ప్రధాన అర్చకులు గూడ నర్సింహాచార్యులు తెలిపారు. గురువారం ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 6.30 గంటలకు స్వస్తివాచనము, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, స్వామి వారికి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 21వ తేదీ ధ్వజారోహణము, 22న శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణం, 23న సుదర్శన హోమం, సంగీత కచేరి, 24 న నూతన రథంపై ఊరేగింపు, 25 న మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, అశ్వవాహన సేవ, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 6.30గంటలకు సేవాకాలం, మంటపారాధాన, చాత్మసేవ, హవనం సాయంత్రం 5గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని ప్రధాన అర్చకులు కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

- నియోజకవర్గం రూరల్ సోషల్ మీడియా కన్వీనర్ అంకిత్‌వర్మ



నియామకపత్రాన్ని అందుకుంటున్న అంకిత్‌వర్మ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గం రూరల్ సోషల్ మీడియా కన్వీనర్ అంకిత్‌వర్మ అన్నారు. రంగారెడ్డి రూరల్ నియోజకవర్గం అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి చేతుల మీదుగా గురువారం నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు మండలాలను సోషల్ మీడియాపరంగా పటిష్టపరుస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కొత్త సోల్కర్‌రెడ్డి, రంగారెడ్డి రూరల్ సోషల్ మీడియా కన్వీనర్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయం వద్ద పక్కకు వంగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



వీర హనుమాన్ ఆలయం సమీపంలో నేలపై విద్యుత్ వైర్లు

ప్రమాదాలకు నిలయంగా..

మణికొండ: వంగిన విద్యుత్ స్తంభం, రోడ్డు మీద తేలిన వైర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మున్సిపాలిటీ కేంద్రంలోని పోచమ్మ ఆలయం ప్రహరీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. ప్రాంగణంలోని షెడ్డుపై ఇనుపరేకులు ఉండడంతో గాలి దుమారం వచ్చినపుడు వైర్లు రేకులకు తగులుతున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మణికొండ మర్రిచెట్టు నుంచి ల్యాంకోహిల్స్ వైపు వెళ్లే దారిలో వీర హనుమాన్ దేవాలయం సమీపంలో వీధిదీపాలకు వెలుతున్న త్రీఫేజ్ వైర్లు బయటకు ఉన్నాయి. వర్షం పడుతున్నపుడు వాటిల్లో నుంచి మెరుపులు వస్తుండటంతో అటుగా వెలుతున్న వారు భయభ్రాంతులవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త తొలగింపు..

సాక్షి ఎఫెక్ట్..

బండ్లగూడ: మురుగుతో అవస్థలు అనే శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పరిసరాలను శుభ్రం చేయించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన జాతీయ రహదారి పక్కన చెత్త, మురుగు కాలువ నిండి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కథనం వెలువడడంతో సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు, స్థానిక ప్రజలు కవర్లల్లో చెత్తను తెచ్చి ఈ ప్రాంతంలో పడేస్తున్నారని దీంతో సమస్య తీవ్రమవుతుందన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా మారడం లేదన్నారు. ఈ ప్రాంతంలో చెత్త వేసే వారికి జరిమానా విధిస్తామని, గార్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



జేసీబీతో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న దృశ్యం

అత్తాపూర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా యాదగిరి



రాజేంద్రనగర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.యాదగిరి బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్‌భాగంగా కొనసాగిన అత్తాపూర్ ఔట్‌పోస్టును కొత్తగా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌గా ఏర్పాటు చేసింది. నగరంలోని ప్రధాన కంట్రోల్ రూమ్‌లో పని చేస్తున్న పి.యాదగిరిని ఈ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

రాజేంద్రనగర్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు తాను పని చేస్తున్న గోదామ్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా సురారం ప్రాంతానికి చెందిన యాదగిరి(25) బతుకుదెరువు కోసం 8 నెలల క్రితం నగరానికి వలస వచ్చాడు. హైదర్‌గూడ చైతన్య విల్లాస్ కాలనీ ప్రాంతంలో జియాగూడ ప్రాంతానికి చెందిన చౌహాన్ నిర్వహిస్తున్న చెరుకు గోదామ్‌లో ఆటో డ్రైవర్‌గా పనిలో చేరాడు. పని చేస్తు గోదాములో ఉండే వాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడం, ఇద్దరు అక్కల వివాహాలు కావడంతో ఒక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి షెడ్‌లో నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. గురువారం ఉదయం షెడ్‌ను తెరిచేందుకు చౌహాన్ రాగా యాదగిరి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. తరచు తనకు ఎవరు లేరని బాధపడుతుండేవాడని చౌహాన్ పోలీసులకు వివరించారు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రాజేంద్రనగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ఓ పాత నేరస్తుడిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన షేక్ చాంద్ పాషా(36) పాత నేరస్తుడు. ఉప్పర్‌పల్లి ప్రాంతంలోని ఓ హోటల్‌లో కుక్‌గా పని చేస్తున్నాడు. గత ఐదు నెలల్లో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు పార్కు చేసిన వాహనాలను దొంగిలించాడు.ఆ వాహనాలను తక్కువ ధరకు అమ్మి వేశాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు గురువారం ఉదయం పీడీపీ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



కంటి వెలుగు కేంద్రంలో మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: కంటి సమస్యలు ఉన్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 6,7వ డివిజన్‌లోని హిదయత్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మేయర్ మహేందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం నెల రోజుల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపయ్య, వార్డు అధికారులు సూర్యప్రకాష్, జగదీశ్వరి, వైద్య అధికారులు అమృత, యశ్వంత్‌గౌడ్, ఇంచార్జీ సల్మాన్, కాలనీవాసులు నదీం, ఇలియాస్, అబ్బుబాకర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బండ్లగూడ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బండ్లగూడ: చిన్ననాటి నుంచే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని టొంగ్ ఇల్ మూ డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు డి.రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. 4వ ఫెడరేషన్ కప్ టొంగ్ ఇల్ మూ డో ఛాంపియన్‌షిప్–2023 అసోసియేషన్ ఆఫ్ హర్యానాలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు హర్యానా కురుక్షేత్రలో జరిగింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం బండ్లగూడ విద్యార్థులు 8 మంది పాల్గొని 8 పతకాలు సాధించారు. ఐదు స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్స్ చైతన్య, ఆదిత్య, శివకుమార్, విషిత్, రిత్విక్‌నాయుడు, మనస్వి రజత పతకం, అక్షిత్, అక్షర కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్, భారత జాయింట్ సెక్రటరీ, టొంగ్ ఇల్ మూ డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ, కోశాధికారి మాస్టర్ ఎస్.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం..గాలులు..కూలిన విద్యుత్ స్తంభం



రోడ్డుపై అడ్డంగా పడ్డ స్తంభం

రాజేంద్రనగర్: ఈదురు గాలులు, వర్షం ధాటికి విద్యుత్ స్తంభం రోడ్డుపై కూలింది. ఎప్పుడు రద్దీగా ఉండే రహదారిపై ఒక్కసారిగా స్తంభం పడడంతో స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సంఘటన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడకు వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు మధ్యలో.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాసం వద్ద ఈ స్తంభాలు ఉన్నాయి. కాగా ఈ నెల 5వ తేదీన ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఈ స్తంభాలకు భారీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. గత 2–3 రోజులుగా వర్షాలు, ఈదురు గాలులకు ఒక పక్కకు వంగింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా రోడ్డుపై అడ్డంగా విరిగిపడింది. ఈ సంఘటన సమయంలో ఈ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రోడ్డుపై స్తంభం కుప్పకూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని స్తంభాన్ని తొలగించారు.

బ్యానర్లను తొలగించాలి

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పలు చౌరస్తాలు, ప్రధాన రహదారులపై భారీగా కటౌట్‌లు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈదురు గాలులు, వర్షాలకు ఇవి కాస్తా ప్రమాదభరితంగా మారాయనివాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'మనూ' దూరవిద్య పోర్టల్ పున:ప్రారంభం

21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్

రాయదుర్గం: మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యావకాశాల కోసం పోర్టల్‌ను పున: ప్రారంభించినట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ గురువారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ ('సెమిస్టర్ మోడ్–2020 బ్యాచ్, సెమిస్టర్ మోడ్ –2019 బ్యాచ్) ప్రోగ్రామ్‌ల యొక్క ఫాలోఅప్ కోర్సులలో నమోదు కోసం పోర్టల్‌ను తెరిచి ఉంచడం జరిగిందన్నారు. ఫీజు చెల్లింపు పోర్టల్ మే 21 వరకు ఉంటుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

ఇద్దరు చైన్ స్నాచర్స్ పట్టివేత

మాదాపూర్: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి రద్దీగా ఉన్న ప్రదేశాలలో చైన్ స్నాచింగ్‌లతో బాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. గురువారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటిలు రెండు బృందాలుగా చైన్ స్నాచర్‌లు, పిక్‌పాకెటర్‌ల కోసం నిఘా పెట్టగా గురువారం ఉదయం 8.30 గంటలకు సీఓడి ఎక్స్ రోడ్ బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను గమనించారు. వీరు కాంబ్లే లక్ష్మణ్, వేముల శ్రీనివాస్‌గా గుర్తించారు. వీరిని విచారించగా రద్దీగా ఉండే బస్సులలో బంగారు గొలుసులను అపహరించినట్లు అంగీకరించారు. మరో 7 గురు రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్నట్టు తెలుపడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బస్టాండ్‌లలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్టు అంగీకరించారు. దాదాపు 10 నుండి 15 మంది ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. కాగా మిగిలిన వారు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. తొమ్మిది బంగారు చైన్స్ 93 గ్రాములు, 3 స్మార్ట్ మొబైల్స్, కీపాడ్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 6.30 లక్షలు ఉంటుందన్నారు.

'రేడియేషన్' పట్ల జాగ్రత్త వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొ. డాక్టర్ ఖాజీ ఎస్ అజర్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ 'రేడియేషన్'పై జాగ్రత్తలు పాటించాలని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ ఎస్ అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ విద్యార్థుల కోసం 'రేడియేషన్ అండ్ సేఫ్టీ మెజర్స్' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వివిధ రకాల రేడియేషన్‌లతో వారి రోజువారీ జీవితంలో ఎలా జాగ్రత్తగా ఉండాలో ఆయన వివరించారు. అమెరికాలో అలైడ్ హెల్త్ నిపుణులు తీసుకునే జీతం ప్యాకేజీలు వైద్యుల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆయన తన ప్రసంగంలో వివిధ రకాల కిరణాలు, వాటి వ్యాప్తి స్థాయిల గురించి విద్యార్థులకు వివరించారు. భద్రతా చర్యలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్, బి, ఒకేషనల్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్, అతిథి ప్యాకల్టీ డాక్టర్ కాజామోయిన్, డాక్టర్ కుల్సుమ్ జహ్రా, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.